www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...   తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 20 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-214 | పేజీలు - 4  వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# తెలంగాణలో 1,030 గురుకుల పాఠశాలలు

## పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మంత్రులు




ఇన్ని పాఠశాలలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

విద్యార్థులకు ఉపయోగపడే కోర్సులు

ఉన్నత విద్యను చేరువ చేయాలన్నదే లక్ష్యం

**వనపర్తి, డిసెంబర్ 19 (సమ సమాజం):** చరిత్రలోనే ఇదో సుదినమని వ్యవసాయశాఖ మంత్రి మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆశీసులతో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలు, రహదారుల విస్తరణ పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జేఎన్టీటీయూ ఇంజినీరింగ్ కళాశాల,



2లో

## లాంగ్‌జంప్ లెన్త్ పెంచడంపై ఆగ్రహం

డిజెపి కార్యాలయం ముందు యూత్ కాంగ్రెస్ నిరసన



**హైదరాబాద్,డిసెంబర్ 19 (సమ సమాజం):** హైదరాబాద్ లోని డీజీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు డీజీపీ ఆఫీస్ ముట్టడికి 3లో

## మల్లారెడ్డిపై ఎమ్మెల్యేల ఆగ్రహం

ప్రగతి భవన్ నుంచి ఎమ్మెల్యేలకు పిలుపు



**హైదరాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** మంత్రి మల్లారెడ్డికి వ్యతిరేకంగా సొంత పార్టీ ఎమ్మెల్యేలు కీలక సమావేశం నిర్వహించడం బీఆర్ఎస్ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ క్రమంలో అసమ్మతి ఎమ్మెల్యేకు ప్రగతి భవన్ నుంచి పిలుపు వచ్చింది. వారు సాయంత్రంలోగా కలవాని అంటూ 3లో

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక చేరేస్తాం



కోమటిరెడ్డికి మల్లు రవి హెచ్చరిక

**హైదరాబాద్,డిసెంబర్ 19 (సమ సమాజం):** టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిపై బీజేపీ నాయకులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా 2లో

## రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై ఆరా

పార్లమెంట్ సమావేశాలు ముగిసాక ఢిల్లీకి రావాలని ఆదేశం

సీనియర్ల విమర్శలకు సీతక్క ఘాటు సమాధానం



**హైదరాబాద్,డిసెంబర్ 19 (సమ సమాజం):** రాష్ట్ర కాంగ్రెస్ పరిణామాలపై హైకమాండ్ ఆరా తీసింది. పార్టీ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ప్రియాంకగాంధీ నేరుగా 2లో

## గర్భిణులకు ఇక కెసిఆర్ న్యూట్రిషన్ కిట్

ములుగులో హోమియో బోధన దవాఖాన

వెల్లడించిన ఆరోగ్యమంత్రి హరీష్ రావు



**సిద్దిపేట, డిసెంబర్ 19 (సమ సమాజం):** గర్భిణిల ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం త్వరలో గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందించనున్నట్లు రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. గర్భిణిలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని, తద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించుకోవచ్చునన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు గ్రామంలో హంస హోమియోపతి మెడికల్ కళాశాల 75 పడకల సంయుక్త బోధన దవాఖానను ప్రారంభించారు. అనంతరం ఆయన వైద్యులు, పురప్రముఖులను ఉద్దేశించిన ప్రసంగించారు. హోమియో మెడికల్ కాలేజీలో 75 పడకల బోధన దవాఖానను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉన్నదని హరీష్‌రావు చెప్పారు. ఆయుష్‌కు మంచి భవిష్యత్ ఉన్నదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో సాంప్రదాయ వైద్యానికి రోజు రోజుకు ప్రాధాన్యం పెరుగుతున్నదన్నారు. 2లో

## తెలంగాణలోనే గురుకులాలు ఎక్కువ

అమినాపురంలో పాఠశాల ప్రారంభోత్సవంలో మంత్రి సత్యవతి

**మహబూబాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** నిరుపేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యను అందించేందుకే ప్రభుత్వం గురుకుల విద్యాలయాలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నదని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. దేశంలో అత్యధిక గురుకుల విద్యాలయాలు కలిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని అమినాపురంలో నిర్మించిన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం క్రైస్తవులకు క్రిస్మస్



2లో

## టిఆర్ఎస్ పేరును బిఆర్ఎస్‌గా మార్పు

ఢిల్లీ కోర్టులో పిటిషన్ వేసిన రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (సమ సమాజం):** టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చడంపై ఢిల్లీ హైకోర్టులో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును సంప్రదించారు. బంగారు కూలి పేరుతో టీఆర్ఎస్ నిధులు సమకూర్చుకోవడానికి సంబంధించి ఈసీకి రేవంత్ గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాల్సిందిగా ఆదాయపు పన్ను శాఖకు అప్పట్లో ఈసీ లేఖ రాసింది. టీఆర్ఎస్ నిధుల కూర్పు అంశంపై విచారణ పూర్తి కాకముందే టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చేందుకు ఈసీ అనుమతి ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రేవంత్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. రేవంత్ పిటిషన్‌పై ఇవాళ ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగే అవకాశముందని తెలుస్తోంది. ఐటీ విచారణ పూర్తి కాకముందే ఎలా టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకునేందుకు అనుమతి ఇస్తారంటూ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెలలో బీఆర్ఎస్‌కు ఈసీ ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు సీఎం కేసీఆర్‌కు ఈసీ లేఖ పంపింది. ఈ లేఖపై సంతకం చేసి



2లో

## 3వేల కుటుంబాలకు క్రిస్మస్ కానుకలు



**గజ్వేల్ డిసెంబర్ 19 (సమ సమాజం):** జ్వేల్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ చొరవతో ఈ ఏడాది క్రిస్మస్ కానుకలను 4 వేల కుటుంబాలకు 2లో

## అయ్యప్ప మాలలో ఉంటూ అబద్దాలా

తప్పుడు అఫిడవిట్‌పై ఎందుకు స్పందించరు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిపై రఘునందన్ విమర్శలు



**హైదరాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** తన ఆస్తులకు సంబంధించి ఎక్కడైనా విచారణకు సిద్దమేనని బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. తనతో పాటు అవినీతి నేతలు కెసిఆర్ సహా అందిరి ఆస్తులపై విచారణ జరగాలన్నారు. అయ్యప్పమాలలో ఉండి అబద్దాలు చెప్పడం ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికే చెల్లిందని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. హిందూ మతాన్ని, ధర్మాన్ని తాము నమ్ముతామని, భాగ్యలక్ష్మి అమ్మవారి దగ్గరికొస్తే నిజాలు మాట్లాడుతాడనుకున్నామని అన్నారు. విద్యార్హత విషయంలో తప్పుడు అఫిడవిట్లు ఇచ్చారని తాను అడిగితే, ఆ విషయం పక్కన పెట్టి, సంబంధం లేని వాటి గురించి మాట్లాడారని అన్నారు. రోహిత్ రెడ్డికి రాష్ట్రంతో గానీ తెలంగాణ 2లో

## వ్యవసాయాన్ని పండగ చేసిన ఘనత కెసిఆర్‌ది

దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లే సత్తా బిఆర్ఎస్‌దే

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వ్యాఖ్య

**నిజామాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు చేపట్టి వ్యవసాయాన్ని విస్తరింపచేసిన ఘనత సిఎం కెసిఆర్‌దేనని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరంతో వ్యవసాయరంగ ముఖచిత్రం పూర్తిగా మారిందన్నారు. ఇలాంటి ప్రయత్నం బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా చేశారి అని ఆయన ప్రశ్నించారు. అన్నమో రామచంద్రా అంటూ పొట్టచేతపట్టుకుని ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలసలు పోయే పరిస్థితిని



2లో

## ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

మార్చి 15వ తేది నుంచి పరీక్షలు

ఫిబ్రవరి 15వ తేది నుంచి ప్రాక్టికల్స్

**హైదరాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి 15వ తేద నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 16 నుంచి మొదలవుతాయి. ఉదయం 9 నుంచి 12 వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు మాత్రం ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మొదలు కానున్నాయి. రెండు విడుతలుగా అంటే ఉదయం 9 నుంచి 12 వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతాయి. ఏప్రిల్ 3వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల టైంటేబుల్ ను ఇంటర్ బోర్డు రిలీజ్ చేసింది.



# సంపాదకీయం

## విపక్షాల ఐక్యత ఎండమావేనా ?

జాతీయ రాజకీయాల్లో ఇప్పటికీ ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ప్రధాన రాజకీయపార్టీగా దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ చేవ చచ్చింది. మొన్నటి హిమాచల్ ఎన్నికల్లో అధికారం దక్కించుకున్నా అక్కడ బిజెపికి వారిని కుదురుగా పనిచేసునేలా చేస్తుందా అన్నది ప్రశ్నే. ఈ క్రమంలో జాతీయ రాజకీయా ల్లోకి ప్రవేశించిన తెలంగాణ సిఎం కెసిఆర్ ఏ మేరకు ప్రభావం చూపుతారన్నది కూడా అనుమానమే. ఇప్పటి కైతే కెసిఆర్ ఎలాంటి అడుగులు వేయడం లేదనే చెప్పాలి. విపక్షాలను కూడగట్టి ముందుకు సాగాల్సిన తరుణం ఇది. గతంలో ఎన్టీఆర్ పోషించిన పాత్రను ఇప్పుడు కెసిఆర్ తీసుకోవాలి. విపక్షాల్లో ఐక్యత తెస్తే తప్ప మోడీ నాయకత్వంలోని బిజెపిని నిలవరించడం సాధ్యం కాదని గుర్తించాలి. విపక్షాలు కూడా స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి ముందుకు రావాలి. టిఆర్ఎస్ ఇప్పుడు బిఆర్ఎస్‌గా మారినా పెద్దగా స్పందన కానరావడం లేదు. ఆయనకు మద్దతుగా కర్నాటక మాజీ సిఎం ఒక్క కుమారస్వామి మాత్రమే కనిపిస్తు న్నారు. ఆయన కూడా కేవలం కర్ణాటక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ దోస్తానా చేస్తున్నారన్న విమర్శ లు కూడా ఉన్నాయి. ఎందుకంటే కర్నాటకలో తెలుగువారు ప్రభావం చేయగలిగి నంతగా ఉన్నారు. ఇకపోతే యూపికి చెందిన అఖిలేశ్ యాదవ్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి మొక్కుబడిగా వచ్చి పోయారు. మమతా బెనర్జీ, శరద్ పవార్, ఉద్దవ్ థాక్రే లాంటి వారు ఇప్పటికీ పెద్దగా స్పందించలేదు. ఆయా రాష్ట్రాల్లో ఎవరి సమస్యలు వారికి ఉన్నాయి. ఎవరి ఇగోలు వారికి ఉన్నాయి. ఎవరికి వారు తామే మోడీకి ప్రత్యమ్నా య నేతగా ఊహించుకుంటున్నారు. ఛాన్స్ వస్తేఊ తామే ప్రధాని పదవికి అర్హులమన్న ధీమాలో ఉన్నారు. ఈ క్రమంలో విపక్షాలను ఏకతాటిపైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు అవసరం. గతంలో ఎన్టీఆర్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కూటమి కట్టి ఎన్‌డిఎ ఏర్పడడానికి కృషి చేశారు. ఇప్పుడు కూడా కెసిఆర్ అలాంటి పాత్ర పోషించాలి. ఆనాడు ఉమ్మడి ఎపిగా ఉన్న ఎన్టీఆర్ బిజెపి, లెఫ్ట్ పార్టీలను కూడా కూడగట్టారు. అలాంటి గట్టి ప్రయత్నం ఇప్పుడు అవసరం. భారత్ రాష్ట్ర సమితి బిఆర్ఎస్ రానున్న ఎన్నికల్లో మోడీకి ప్రత్యామ్నాయం గా వివిధ పార్టీలను కలుపుకుని పోవాలి. నియంతృత్వ పోకడలతో, విద్వేష రాజకీయాలతో సాగుతున్న భారతీయ జనతా పార్టీని 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా కట్టడి చేయడం లక్ష్యంగా ముందుకు సాగడం అంత సులువు కాదు. ప్రతిపక్షాలన్నీ ఒక్కటయ్యే చరిత్రాత్మక పరిణామం దిశగా బిఆర్ఎస్ కృషి సాగితేనే కెసిఆర్ లక్ష్యం నెరవేరగలదు. కొన్ని నెలలుగా కెసిఆర్ ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాభిప్రా యాలను తెలుసు కొంటున్నారు. బిజెపియేతర ప్రతిపక్షాలతో చర్చలు జరుపుతున్నారు. ఇవన్నీ సానుకూల సంకేతాలు ఇవ్వడం లేదు. ఏ ఒక్క నేత కూడా మనఃస్ఫూర్తిగా కలసి రావడం లేదు. దేశ రాజధాని ఢిల్లీ బిఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించినప్పటికీ విపక్ష నేతల్లో చలనం కానరావడం లేదు. ఆసక్తి కూడా చూపడం లేదు. మోడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేయడంలో అన్నిపార్టీలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. కార్పొరేట్ సామ్రాజ్యం విస్తరించి ప్రభుత్వ రంగసంస్థలన్నీ దాని గుప్పెటలోకి పోతోంది. ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేట్ పరం అవుతున్నాయి. విశాఖ ఉక్కు, ఎల్ఐసి లాంటి సంస్థలు కనుమరుగు అవుతున్నాయి. ఇంతటితోనే ఈ ప్రైవేటీకరణ ఆగదని అందరికీ తెలుసు. దీంతో ఉన్న ఉద్యోగాలు ఊడి, నిరుద్యోగం పెరిగి యువత అల్లాడుతోంది. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంతో కాంగ్రెస్‌ను తుడిచిపెట్టుకుని పోయేలా చేయడంలో మోడీ విజయం సాధించారనే చెప్పాలి. ప్రజావ్యతిరేక విధానాలతో సాగుతున్న పెడ ధోరణులను ప్రశ్నించే వారిపై ఇడి, సిబిఐ, ఐటి వంటి సంస్థల దాడులను ఉసిగొల్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బిజెపి ధృతరాష్ట్ర కౌగిలినుంచి కొన్ని నెలల క్రితమే బయట పడ్డా ఆయన కూడా కెసిఆర్‌కు కనీసంగా అండగా నిలుస్తామని, కలసి పనిచేద్దామని ముందుకు రావాడం లేదు. నిజానిక చెప్పాలంటే విపక్షాల ఐక్యతకు సంబంధించి ఒక్క అడుగు కూడా పడడం లేదు. ఎవరికి వారు బిగుసుకుని కూర్చున్నారు. అయితే నితీశ్‌ది కూడా అవకాశవాదమనే విమర్శ ఉంది. బిజెపి వ్యతిరేక శక్తులను కూడగడతానని ప్రకటించినా ఆ మేరకు ఇంకా సరైన అడుగులు ముందుకు పడడంలేదు. తృణమూల్ అధినేత్రి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం బిజెపికి వ్యతిరేకంగా పోరాడినా ఈ మధ్య ఆమె కూడా మెత్తపడ్డారు. విపక్షాలను ఏకం చేసే ప్రయత్నంలో ఆమె కూడా ఓ రకంగా విఫల మయ్యారు. రాష్ట్రీయ జనతాదళ్, నేషనలిస్టు కాంగ్రెస్ వంటి పార్టీలు కూడా సరైన మార్గదర్శకత్వంలో నడవడం లేదు.మరోవైపు విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు జాతీయ ప్రతిపక్షంగా కాంగ్రెస్ గట్టి పాత్రను పోషించలేకపోతోంది. ఈలోటు భర్తీ చేయవలసిన అవసరం ప్రాంతీయ పార్టీలపై ఉండడంతో ఇప్పుడు కెసిఆర్ చేపట్టిన బిఆర్ఎస్ సరైన సమయంలో తీసుకున్న చర్య తీసుకునేందుకు అడుగు పెట్టినా అందుకు తగ్గ కార్యాచరణ ముఖ్యం. విపక్షాలను ఏకం చేసే లక్ష్యం కావాలి.జనాభాలో 40 శాతం మంది 13 ఉన్న యువతను కదిలించగలగాలి. యువతకు భరోసా కలిగించేలా సాగాలి. బిజెపి బలం పెంచుకోడానికి నిరంతరంగగా పనిచేస్తోంది. బిజెపి బలంతో అన్ని రాష్ట్రాల్లో అధికారం చేజిక్కించుకోవాలన్న తాపత్రయం తో పావులు కదుపుతోంది. దీనికి అడ్డుకట్ట వేయడానికి బలంగా పనిచేయాలి. విపక్షాలను ఏకతాటిపైకి తీసుకుని రావాలి. వారిలో ఉన్న అనుమానాలను కెసిఆర్ నివృత్తి చేయగలగాలి. రాష్ట్రాల హక్కులు, సమాఖ్య వ్యవస్థ బలోపేతానికి ఇది అవసరం. ఇందుకు అనుగుణంగా కెసిఆర్ ఎలాంటి ప్రయత్నం చేస్తారన్నది చూడాలి. ఎపిలో టిడిపి, వైసిపి రెండు పార్టీలు కూడా మోడీకి అనుకూలంగా ఉంటున్నారు. వారికి తమ సొంత ఎజెండా ఉంది. అందువల్ల ఎపి నుంచి మద్దతు దక్కుతుందన్న అవకాశం లేదు. ఈ క్రమంలో కెసిఆర్ ఎలాంటి పాత్రపోషిస్తారో చూడాల్సిందే.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## గర్భిణులకు ఇక కెసిఆర్ న్యూట్రిషన్ కిట్

(మొదటి పేజీ తరువాయి) ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి.. దేనికవే ప్రత్యేకత కలిగి ఉన్నాయని చెప్పారు. తెలంగాణలో అందరికీ వైద్యం అందించే క్రమంలో కేసీఆర్ ఆలోచనల మేరకు బస్తీ ప్లలె దవాఖానాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ప్లలె దవాఖానల్లో ఆయుష్ డాక్టర్లను కూడా రిక్రూట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాలని కేంద్ర ఆయుష్ సెక్రెటరీ రాజేష్‌కు కొటేషన్ కూడా పంపినామని చెప్పారు. నేచర్ క్యూర్ దవాఖాన కోసం రూ.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సిద్దిపేటలో మాదిరిగానే వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లిలో కూడా 50 పడకలతో కూడిన ఆయుష్ దవాఖానలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో 834 ఆయుష్ డిస్పెన్సరీలు, 5 కాలేజీలు, 4 రీసెర్చ్ హాస్పిటల్స్ ఉన్నాయని, వీటిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కరోనా వైరస్‌కు చికిత్స మాదిరిగా అనవసరపు సీ సెక్షన్లు పెరిగాయని, తల్లీబిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైతేనే తప్ప సీ సెక్షన్ చేయవద్దని డాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నామని హరీష్‌రావు చెప్పారు.

## టీఆర్ఎస్ పేరును బిఆర్ఎస్‌గా మార్పు

(మొదటి పేజీ తరువాయి) ఈసీకి కేసీఆర్ రిప్లై ఇచ్చారు. దీంతో టీఆర్ఎస్ ఇక బీఆర్ఎస్‌గా మారింది. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను తెలంగాణ భవన్‌లో పార్టీ నేతల సమక్షంలో కేసీఆర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి, నటుడు ప్రకాష్ రాజ్ కూడా హాజరయ్యారు. ఇటీవల ఢిల్లీలోని సర్దార్ పటేల్ రోడ్డులో బీఆర్ఎస్ తాత్కాలిక కార్యాలయాన్ని కూడా కేసీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కుమారస్వామి, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, పలువురు రైతు సంఘాల నాయకులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఆఫీస్ ఆవరణలో కేసీఆర్ సతీసమేతంగా రాజశ్యామల యాగం చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ పర్యటన సందర్భంగా ఐదు రోజుల పాటు ఢిల్లీలోనే ఉన్న కేసీఆర్... ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నేతలు, రైతు సంఘాల నేతలతో చర్చలు జరిపారు. బీఆర్ఎస్‌లో చేరేందుకు మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీకి చెందిన పలువురు నేతలు ఆసక్తి చూపారు. త్వరలోనే బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు ఉండే అవకాశముంది. ఈ క్రమంలో గతంలోని వ్యవహారాన్ని రేవంత్ ఇప్పుడు తెరపైకి తీసుకొచ్చి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం కీలకంగా మారింది. పార్టీ పేరు నుంచి తెలంగాణను తీసేయడం వల్ల తెలంగాణ ద్రోహిగా కేసీఆర్ మారిపోయారని రేవంత్ ఆరోపిస్తున్నారు. తెలంగాణ ప్రజలను వదిలేసి దేశ రాజకీయాలను మార్చేస్తానంటూ కేసీఆర్ డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

## రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై ఆరా

(మొదటి పేజీ తరువాయి) రంగంలోకి దిగారు. ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడినట్లు సమాచారం. ఏదైనా సమస్య ఉంటే ఢిల్లీ వచ్చి మాట్లాడాలని చెప్పినట్లు టాక్ వినిపిస్తోంది. అసమ్మతి నేతలను ఢిల్లీకి రావాలని ప్రియాంక గాంధీ చెప్పినట్లు తెలుస్తోంది. నేటి అసమ్మతి నేతల మీటింగ్ ను వాయిదా వేసుకోవాలని ప్రియాంక గాంధీ కోరినట్లు సమాచారం. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తీరుతో చాలామంది నేతలు ఇబ్బంది పడుతున్నట్లు ప్రియాంక గాంధీ దృష్టికి ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. మరోవైపు రేపు మరోసారి సమావేశం కావాలని సీనియర్ నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలావుంటే అసమ్మతి నేతల తీరుపైనా రేవంత్ వర్గ మండిపడుతోంది. వీరు అధికార టిఆర్ఎస్, బిజెపిలకు సహకరిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యవహారాలపై చర్చించేందుకు పార్లమెంట్ సమావేశాలు ముగిసాక ఢిల్లీకి రావాలని సూచించింది. ఇదిలావుంటే టిడిపి నుంచి వచ్చిన వారికే పదవుల్లో ప్రాధన్యం ఇచ్చారని ఉత్తమ్ తదితరులు చేసని ఆరోపణలపై సీతక్క ఘాటుగా స్పందించింది. తెలంగాణ కాంగ్రెస్‌లో ఏర్పడిన తీవ్ర పరిణామాల నడుమ పీసీసీ పదవికి రాజీనామా చేసిన అనంతరం ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆసక్తికర కామెంట్లు చేశారు. తాను నిఖార్సయిన కార్యకర్త కాదు కాబట్టే.. బహిరంగంగా విమర్శలు చేయటం లేదన్నారు. తమ పదవులు సీనియర్లకు ఆటంకంగా, అసంతృప్తిగా అనిపించాయి కాబట్టే రాజీనామాలు చేశామని తెలిపిన సీతక్క.. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలని కాదని స్పష్టం చేశారు. వాళ్లకు భయపడి కాదని.. భాదను అర్థం చేసుకొని రాజీనామాలు చేశామన్నారు. తాము సంక్షోభం సృష్టించదలుచుకోలేదని.. సమస్యకు పరిష్కారం చూపదలచుకు న్నామన్నారు. తమను నాలుగైదు పార్టీలు తిరిగి వలస వచ్చారంటూ విమర్శలు చేయటం బాధకలిగించిందన్నారు. అలాంటి విమర్శలు విన్నప్పుడు గుండె తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడున్నా కష్టపడే మనస్తత్వం ఉంది కానీ.. మాటలు మోసే వ్యక్తులం కాదని ఘాటు వ్యాఖ్యలు చేశారు సీతక్క. ఏడాది కాలంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన కార్యక్రమాల్లో మొత్తం మంది నాయకుల్లో ఎంత మంది పాల్గొన్నారనేది చూస్తే ఎవరు కష్టపడుతున్నారన్న విషయం అర్థమవుతోందని సీతక్క పేర్కొన్నారు. నిజంగా పదవుల పట్ల అసంతృప్తి ఉంటే జాతీయ నాయకత్వంతో తేల్చుకోవాలని సీతక్క సూచించారు. తాము పదవుల కోసం రాలేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ సంక్షోభంలో ఉన్నప్పుడే పార్టీలోకి వచ్చామన్న సీతక్క.. ఎలాంటి పదవులు లేకపోయిన కష్టపడి పనిచేస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను పట్టుకుని తమను వలసవాదులుగా చిత్రీకరించటం సరైందని కాదని హితవు పలికారు. ఇప్పటికీ తాము పార్టీలోకి వచ్చిన ఐదేళ్లు గడిచిందని.. ఇంకా టీడీపీ వాళ్లమే అంటే ఎలా అని సీతక్క ప్రశ్నించారు. తాము భుజాన జెండా వేసుకుని కష్టపడుతున్నామని.. అయినా ఇలా దెప్పిపొడవటం కరెక్టు కాదన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో రెండు అధికార పార్టీల నుంచి పెద్ద పెద్ద ఆఫర్లు వస్తుంటే.. మేము మాత్రం కాంగ్రెస్ జెండా పట్టుకుని కష్టపడుతుంటే.. ఇలా విమర్శించటం బాధాకరమని సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఉన్న వాళ్లంతా కలిసి కట్టుగా పని చేసినప్పుడే.. రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం తీసుకురావటం సాధ్యమవుతుందని సీతక్క అభిప్రాయపడ్డారు.

## 3వేల కుటుంబాలకు క్రిస్మస్ కానుకలు

(మొదటి పేజీ తరువాయి) తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నది. గతేడాది 3వేల కుటుంబాలకు క్రిస్మస్ కానులు అందించగా, ఈ సంవత్సరం మరో వెయ్యి కుటుంబాలకు అందిస్తున్నారు. నియోజకవర్గంలోని గజ్వేల్, తూప్రాన్ మున్సిపాలిటీలతోపాటు గజ్వేల్, వర్గల్, ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, కొండపాక, తూ ప్రాన్, మనోహరాబాద్ మండలాలకు చెందిన 4వేల క్రిస్టియన్ కుటుంబాలకు కానుకలను అందిస్తుండగా, ఆయా చర్చిల ఫాదర్లు, పాస్టర్లకే లబ్ధిదారుల ఎంపిక బాధ్యతలు అధికారులు అప్పగించారు. గజ్వేల్ క్రిస్టియన్ భవన్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా క్రిస్మస్ కానుకలు పంపిణీ చేయనున్నారు.

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక చేరేస్తాం



(మొదటి పేజీ తరువాయి) ఖండిస్తున్నామని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లురవి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిని బ్లాక్ మెయిలర్ అని కోమటిరెడ్డి మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. నోరుజారి ఇష్టమున్నట్టు మాట్లాడితే నాలుక చీరుస్తాం జాగ్రత్త అని హెచ్చరించారు. కాంగ్రెస్ పెట్టిన రాజకీయ బిక్షతో పదవులు పొంది ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ గా, ఎంపీ గా గెలిచిన రాజగోపాల్ రెడ్డి, డబ్బులకు కక్కుర్తి పడి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేశారని మండిపడ్డారు. బీజేపీలో చేరిన రాజగోపాల్ రెడ్డి రాజకీయ వ్యభిచారం చేస్తూ ఇతర పార్టీల నాయకలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరన్నారు. ఇప్పటికైనా పిచ్చి మాటలు మనకపోతే ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణలోనే గురుకులాలు ఎక్కువ



(మొదటి పేజీ తరువాయి) కానుకలను పంపిణీ చేశారు. పలువురు కల్యాణలక్ష్మి లబ్దిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో అన్ని సదుపాయాలతో విద్యనందించడంతో పాటు అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఫలితంగా తల్లిదండ్రుల నుంచి ఆదరణ పెరుగుతుందన్నారు. దేశంలో చివరిగా ఏర్పాటైన రాష్ట్రం తెలంగాణ అని, అభివృద్ధిలో మాత్రం ముందుందన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. త్వరలో మహబూబాబాద్‌లో మరో గిరిజన గురుకుల పాఠశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే భానోత్ శంకర్ నాయక్, జడ్పీ అధ్యక్షురాలు బిందు, ఆర్డీవో రమేశ్, డీఎస్పీ సదయ్య, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలలో ఉంటూ అబద్ధాలా

(మొదటి పేజీ తరువాయి) ఉద్యమంతో సంబంధం లేదన్నారు. తెలంగాణ వచ్చాక అదృష్టం కలిసొచ్చి ఎమ్మెల్యే అయిన ఆయన తన గురించి కామెంట్లు చేస్తున్నాడని మండిపడ్డారు. 2018 ఎన్నికల ప్రచారంలో దొరలు తిరిగే కారు కావాలా.. అన్నం తినే చేయి కావాలా అని రోహిత్ రెడ్డి అడిగిన విషయాన్ని రఘునందన్ గుర్తు చేశారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను ప్రదర్శించారు. ప్రజలు నమ్మి ఓటేసినందుకు అన్నం తినిపించిన చేయికి సున్నం పెట్టాడని, బీ ఫామ్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గోదావరి కలిపాడని విమర్శించారు. అయ్యప్ప మాలలో ఉన్నాడన్న ఒకే ఒక్క కారణంతో ఇంతకంటే ఏం మాట్లాడలేకపోతున్నానని అన్నారు. రోహిత్ రెడ్డి మాల తీసిన తర్వాత తాను ప్రతీ దానికి జవాబు చెప్తాడని రఘునందన్ స్పష్టం చేశారు. తనను సస్పెండ్ చేసినపుడు తనపై చేసిన ఆరోపణలు నిరూపించమంటే ఏ ఒక్కరు కూడా మాట్లాడలేదని రఘునందన్ రావు అన్నారు. తాను అక్రమంగా సంపాదించి ఉంటే.. ఇల్లీగల్ పనులు చేసుంటే.. ప్రగతి భవన్ గానీ, సీఎం ఆఫీస్ గానీ ఈ రోజు దాకా ఎందుకు విచారణ జరిపించలేకపోయిందని నిలదీశారు. తానే తప్పు చేయనందునే సీఎం కూడా చర్యలు తీసుకోలేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత బాగుపడ్డది కేసీఆర్, పట్నం మహేందర్ రెడ్డి కుటుంబాలేనన్న రఘునందన్ రావు.. దమ్ముంటే 2013లో తనపై చేసిన ఆరోపణలను ఎప్పుడు రుజువు చేస్తరో చెప్పాలని డిమాండ్ చేశారు. సర్పన్ పల్లి భూములకు, రోహిత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేనట్టయితే చీఫ్ సెక్రటరీకి లేఖ రాయమని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. డ్రగ్స్ తీసుకోలేదని రోహిత్‌రెడ్డి ఎందుకు ప్రమాణం చేయట్లేదని ప్రశ్నించారు. ఇప్పుడు అదే దొరల కాంపౌండ్‌లో రోహిత్‌రెడ్డి చేరారని వ్యాఖ్యలు చేశారు. 2009 కంటేముందు స్వీడన్ వర్సిటీలో చదివినట్లు అఫిడవిట్‌లో చెప్పారన్నారు. 2018 నాటికి ఇంటర్‌గా ఎలా మారిందో రోహిత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్హతల విషయంలో రోహిత్‌రెడ్డి తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంతో రోహిత్‌రెడ్డికి సంబంధం లేదని రఘునందన్ అన్నారు.

## వ్యవసాయాన్ని పండగ చేసిన ఘనత కెసిఆర్‌ది



(మొదటి పేజీ తరువాయి) తప్పించింది కేసిఆర్ మాత్రమేనని అన్నారు. దళిత బంధు, రైతుబంధు వంటి పథకాలతో ప్రజలకు ఆసరా కల్పించిన ఘనత కెసిఆర్‌దన్నారు. రైతుబంధు పథకం కింద తెలంగాణ ప్రభుత్వం రుణాలను అందిస్తోంది. ఈ పథకం కింద తీసుకునే రుణాలకు కూడా రైతులు ఎలాంటి వడ్డీని చెల్లించాల్సిన అవసరం లేదు. 68 లక్షల మంది రైతులు ఈ పథకం కింద ప్రతి ఏడాది పెట్టుబడి సాయం పొందుతున్నారు. రాష్ట్రంలో కోటి 50 లక్షల 43 వేల 606 ఎకరాలకు పంట సాగు జరుగుతోంది. తెలంగాణలో సుమారు 55 శాతం మంది జనాభా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పంట పెట్టుబడి పథకం వల్ల 90.5 శాతానికి పైగా పేద ప్రజలు ప్రయోజనం పొందుతున్నారు. అంతకుముందు రైతులకు పంట సాయం దొరకకపోతుండటంతో.. పెట్టుబడిదారులు, దళారుల నుంచి అప్పులు తెచ్చుకునేవారు. వారు రైతులపై అధిక వడ్డీలు విధించేవారు. ఈ వడ్డీలతో రైతులు అప్పులు పాలై, ఆత్మహత్యలు చేసుకునేవారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వ రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయరంగం గణనీయంగా అభివృద్ధి చెందింది. దేశంలో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు మార్గ దర్శనంగా ఉన్నది. మత ఘర్షణలకు తావు లేని విధంగా ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పి చక్కటి పాన సాగిస్తున్నారని అన్నారు. ఒక్క తెలంగాణలోనే కాదు, దేశమంతా ఇలాంటి సామరస్య, ప్రశాంత వాతావరణం నెలకొనాలని, అన్నిరంగాల్లో ప్రగతి పథంతో దేశం ముందుకు వెళ్లాలన్నదే కెసిఆర్ లక్షం అన్నారు. ఆమరణ దీక్షతో తెలంగాణను ఎలా సాధించ గలిగారో అలాగే మోడీ నుంచి భారత దేశాన్ని విముక్తి చేయాలన్న దీక్షా కంకణాన్ని కెసిఆర్ కట్టుకున్నారు. పార్టీల సిద్ధాంతాలకు, స్వప్రయోజనాలకు అతీతంగా ఆవిర్భవించిన బిఆర్ఎస్ కు వివిధ పార్టీలు మద్దతు ఇచ్చి మరింత బలోపేతం చేయవలసి ఉందన్నారు. బిజెపియేతర పార్టీలన్నీ సమష్టిగా కెసిఆర్ సారథ్యంలో ముందుకు వెళ్తే 2024 ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం కుప్పకూలడం ఏమంత కష్టం కాదని జీవన్ రెడ్డి అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ఇక విపక్షాలపైనే ఉందన్నారు.

## తెలంగాణలో 1,030 గురుకుల పాఠశాలలు



(మొదటి పేజీ తరువాయి) భూమిపూజ, ఐటీఐ కళాశాల, మహిళా బీసీ వ్యవసాయ గురుకుల కళాశాలకు మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ పోతుగంటి రాములతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో 1,030 గురుకుల పాఠశాలలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. గురుకులాలను ఏటా జూనియర్, డిగ్రీ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసుకుంటూ వెళు న్నామన్నారు. సీఎం కేసీఆర్ కేసీఆర్ 16 జిల్లాల్లో ఇటీవల బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే కోర్సులు ఉండాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని, అందుకే మహిళా బీసీ గురుకుల కళాశాలలో ప్రత్యేకంగా వ్యవసాయ విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడద న్నది ప్రభుత్వ ఆలోచన అని, భవిష్యత్‌లో వనపర్తి వాసులు ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో ఉండాలన్నది తన ఆకాంక్ష అని మంత్రి అన్నారు. వివిధ విద్యా సంస్థల ఏర్పాటుకు సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రులు సబిత, గంగుల కమలాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో గతవానాకాలం సీజన్‌లో 1.46కోట్ల ఎకరాలకు రైతుబంధు అందించామని, అత్యధికశాఖ రైతులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకే అందుతుందన్నారు. వనపర్తి వ్యవసాయ కళాశాల కోసం 70 ఎకరాల భూమి అవసరమని, మొదటి దశలో 35 ఎకరాలు అవసరమన్నారు. మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ తదితర విద్యాసంస్థల కోసం అక్రమార్కుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకువచ్చినట్లు తెలిపారు. కండ్ల ముందే వనపర్తి జిల్లా అభివృద్ధి కనిపిస్తుదని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు పలువురు మంత్రులతో కలిసి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. మంత్రి నిరంజన్‌రెడ్డి ఏది దాని వెనుక ప్రజల ప్రయోజనం ఉంటుందన్నారు. వనపర్తి ప్రజలు భవిష్యత్‌లో సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డిని తప్పకుండా గుర్తు పెట్టుకుంటారన్నారు. బీసీ మహిళా డిగ్రీ కళాశాలలో వ్యవసాయ కోర్సు ప్రవేశపెట్టడం అభినందనీయ మన్నారు. అందరు సమన్వయంతో పని చేయడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో 1,153 జూనియర్ గురుకుల కళాశాలలు ఉన్నాయని, రూ.20 లక్షల ఓవర్సీస్ స్కాలర్ షిప్ ఇచ్చి విద్యార్థులను చదివిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. రూ.3500 కోట్లతో 'మన ఊరు ? మనబడి' కింద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నీళ్లు తెచ్చి.. నీళ్ల నిరంజన్‌రెడ్డిగా పేరు తెచ్చుకున్నారని.. ఇన్ని విద్యాసంస్థలు తెచ్చినందుకు ఇంకో పేరు పెట్టాలని అన్నారు. పోటీని తట్టుకునేందుకు ఆంగ్ల విద్య తప్పనిసరి భావించిన తెలంగాణ ప్రభుత్వం.. మేరకు ప్రోత్సహిస్తుందన్నారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో 60 శాతం ఉన్న బీసీలను విద్యకు దూరం చేశారని మంత్రి గంగుల పరామర్శించారు. చదువులో బీసీలు వెనుకబడలేదని, వెనుకపడేయబడ్డారన్నారు. చదువు అందుబాటులోక కులవృత్తుల్లోనే ఉపాధిని వెతుకున్నారన్నారు. తెలంగాణ రాక ముందు తెలంగాణ 19 బీసీ గురుకులాలు మాత్రమే ఉండేవని, ఆర్థిక ఇబ్బందులతో తల్లిదండ్రులు బిడ్డలను ఉన్నత విద్యకు దూరం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ 310 బీసీ గురుకులాలు ఏర్పాటు చేశారన్నారు. ఈ బిడ్డలు తెలంగాణ ఆస్తి అని, వారిని సీఎం కేసీఆర్ చదివిస్తున్నారన్నారు. దేశంలో ప్రథమంగా డిగ్రీ గురుకుల కళాశాలలు ఏర్పాటు చేశారని, ఆస్తులమ్ముకుని పిల్లలను చదివించుకునే దుస్థితిని కేసీఆర్ తప్పించారన్నారు. భవిష్యత్ ఉపాధి, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని కొత్త కోర్సులను డిగ్రీ కళాశాలల్లో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ వనపర్తి.. వనరులపర్తి అని, త్వరలో వనపర్తి, నాగర్ కర్నూలు, గద్వాలకు కేంద్రీయ విద్యాలయాలు తీసుకువస్తామన్నారు. భవిష్యత్‌లో ఇతర ప్రాంతాలకు వనపర్తి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని, సీఎం కేసీఆర్ ప్రధాని కావాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి కావాలని, అబద్దాలతో బీజేపీ ఎనిమిదన్నరేళ్లుగా దేశ ప్రజలను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఇంకో ఏడాదిన్నర అయితే బీజేపీ పీడ విరగడ అవుతుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి పథకాలు లేవని, జిల్లాకో మెడికల్ కళాశాల ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనతేనన్నారు. కేసీఆర్ కేంద్రంలో అధికారంలోకి వస్తే ఈ పథకాలన్ని దేశమంతటా అమలవుతాయన్నారు. దేశానికే తెలంగాణ ఆదర్శమన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సీట్లు దొరకడం లేదని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం మన అదృష్టమన్నారు. ప్రతి నిమిషం ఆయన ప్రజల గురించే ఆలోచిస్తున్నాడ న్నారు. మన పార్టీ బీఆర్ఎస్ అని, కాబోయే ప్రధాని కేసీఆర్ అన్న లక్ష్యం కార్యకర్తలు పని చేయాలన్నారు. వనపర్తి జిల్లా అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయానన్న మల్లారెడ్డి.. మంత్రి నిరంజన్‌రెడ్డి మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలు తెచ్చారన్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో వనపర్తి అభివృద్ధి ముందున్నదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతు, బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య భట్టు, రిజిస్ట్రార్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లాంగ్‌జంప్ లెన్త్ పెంచడంపై ఆగ్రహం

**(మొదటి పేజీ తరువాయి)** ప్రయత్నించారు. కానిస్టేబుల్ నియామక దేహదారుఢ్య ఈవెంట్స్ లో లాంగ్ జంప్ లెంగ్త్ పెంచడంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. 3.8 మీటర్ల నుండి 4 మీటర్ల వరకు పెంచడం వల్ల చాలా మంది అనర్హులుగా తిరిగి వస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు షాట్ పుట్‌లోనూ పెంచిన లెంగ్త్‌ను తగ్గించాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి నోటిఫికేషన్ కోసం ఎదురుచూసిన అభ్యర్థులు.. ఇప్పుడైనా తమకు ఉద్యోగం వస్తుందని ఆశిస్తున్నారని యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పారు. కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో మార్పులు చేయడం వల్ల ఎంతోమంది అర్హత ఉన్నా అనర్హులుగా మిగిలిపోవాల్సి వస్తుందని అన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పలువురు కాంగ్రెస్ యూత్ కార్యకర్తలను అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సమయంలో పోలీసులు, నిరసనకారుల మధ్య వాగ్వాదం జరిగింది.

# మల్లారెడ్డిపై ఎమ్మెల్యేల ఆగ్రహం

**(మొదటి పేజీ తరువాయి)** సమాచారం ఇచ్చారు. మంత్రి మల్లారెడ్డి ప్రస్తుతం మేడ్చల్ ఎమ్మెల్యేగా ఉండగా.. మల్కాజ్ గిరి, ఉప్పల్ పరిధిలోని నియోజకవర్గాల్లో ఆయన జోక్యం చేసుకోవడంపై ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నారు. సోమవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఇంట్లో మేడ్చల్ జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు పాల్గొన్నారు.మార్కెట్ కమిటీ ఛైర్మన్ మార్పు విసయంలో మల్లారెడ్డి తీరుపై వివేకానంద గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పదవుల విషయంలో మంత్రి తమకు సమాచారం ఇవ్వడం లేదని కృష్ణారావు, అరికెపూడి గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రహస్య భేటీ కాదని, కర్టసీ మీటింగ్ అని వివేకానంద పేర్కొన్నారు. కుటుంబం లాంటి పార్టీలో చాలా అంశాలు ఉంటాయని, మార్కెట్ కమిటీ పదవి అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తొందరపడి జీవో ఇచ్చారని, ఎమ్మెల్యేలమంతా ఒక మాటపైన ఉన్నామని తెలిపారు. పార్టీ అధిష్టానం దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని వివేకానంద స్పష్టం చేశారు. కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. తమ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని, పదవులన్నీ ఒకే నియోజకవర్గానికి వెళుతున్నాయని ఆరోపించారు. జిల్లా పదవులన్నీ మంత్రి తీసుకెళ్లిపోతున్నారని, మంత్రి తమను పట్టించుకోవడం లేదన్నారు. మల్లారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కృష్ణారావు విమర్శించారు. ఇక నామినేటెడ్ పదవులు తమ కార్యకర్తలకు రావడం లేదని, తమ అనుచరులకే ఇప్పించుకుంటున్నారని అరికెపూడి గాంధీ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మల్లారెడ్డికి వ్యతిరేకంగా సొంత పార్టీ ఎమ్మెల్యేలు భేటీ కావడం బీఆర్ఎస్ వర్గాల్లో కలకలం రేపుతోంది. కలిసి పనిచేయాల్సిన నేతలందరూ ఇలా వర్గాలుగా విడిపోయి మంత్రి మల్లారెడ్డికి వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టి బహిరంగంగా తమ అక్కసు వెల్లగక్కడం పార్టీలో దుమారం రేపుతోంది. ఎన్నికలకు కొద్దినెలలు మాత్రమే సమయం ఉన్న క్రమంలో.. బీఆర్ఎస్‌లోని నేతల మధ్య విబేధాలు శ్రేణులను కలవర పెడుతున్నాయి. దీనిపై హైకమాండ్ స్పందించి నేతల మధ్య సమన్వయం కుదుర్చుతుందా..? లేదా? అనేది పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. నేతల మధ్య పంచాయతీపై హైకమాండ్ స్పందించే అవకాశముంది. నేతలందరూ కలిసి పనిచేయాలని సూచించే అవకాశముందని తెలుస్తోంది. మరి ఈ పంచాయతీ రానున్న కొద్ది రోజుల్లో ఎటువైపు తారితీస్తుందనేది చూడాలి.

# అమరుల ఆశయాలు కొనసాగిద్దాం: అల్లం నారాయణ



**పెద్దపల్లి, డిసెంబర్ 19 (సమ సమాజం):** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయాలను కొనసాగిద్దామని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ అన్నారు. సోమవారం హన్మకొండ నుంచి పెద్దపల్లి మీదుగా గోదావరిఖని వెళ్తున్న సందర్భంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆయన నివాళు లర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఎన్నో ఆశయాలతో సాధించికున్న తెలంగాణను అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. రాష్టాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలుపరుస్తుందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమంతో బంగారు తెలంగాణను తయారుచేస్తున్న ప్రభుత్వానికి మనమంతా రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు అల్లం నారాయణకు పూలబొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. జర్నలిస్టులు వేణుగోపాల్, మల్లేష్, తిరుపతి గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# నిర్మల్ ఆస్పత్రి మార్చురీ వద్ద ఉద్రిక్తత


### భాను ఆత్మహత్యపై ఎబివిపి, బిజెపి ఆందోళన




**నిర్మల, డిసెంబర్ 19 (సమ సమాజం):** నిర్మల్ ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీ దగ్గర ఉద్రిక్తత ఏర్పడింది. ట్రిపుల్ ఐటీ విద్యార్థి భాను ప్రసాద్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. బీజేపీ, ఏబీవీపీ నేతలు ఆస్పత్రిలోకి చొచ్చుకెళ్లారు. ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో జిల్లా ఆస్పత్రి దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు బీజేపీ, ఏబీవీపీ నేతలను అరెస్టు చేశారు.భాను ప్రసాద్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గదిలో నుంచి దుర్వాసన వచ్చే వరకు సిబ్బంది మృతదేహాన్ని గుర్తించకపోవడంపై కుటుంబసభ్యులు, బంధువులు మండిపడుతున్నారు. మరోవైపు భానుప్రసాద్ ఉరి వేసుకున్న గదిలో సూసైడ్ లెటర్ లభ్యమైంది. తన చావుకు ఎవరూ బాధ్యులు కారని, మానసిక సమస్యే తన నిర్ణయానికి కారణమని అందులో రాశాడు. భానుప్రసాద్ సూసైడ్ లెటర్ లో చెప్పిన వ్యాఖ్యలపై అతని కుటుంబసభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అంటున్నారు. మూడునాల్రోజుల క్రితమే భాను ఆత్మహత్య చేసుకున్నా..క్యాంపస్ అధికారులు ఎవరూ చెప్పలేదని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా డాక్టర్లతో పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

# త్వరలోనే ఓపిఎస్ పెన్షన్ విధానం

### తొలి కేబినేట్‌లో సంతకం చేస్తామన్న సిఎం




**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (సమ సమాజం):** ప్రభుత్వ ఉద్యోగులకు పాత ఫించను విధానం ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించడంపై తొలి మంత్రివర్గ సమావేశంలోనే కచ్చితంగా నిర్ణయం తీసుకుంటామని హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తెలిపారు. మంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరుగుతుందని, ఆ తర్వాత జరిగే తొలి కేబినెట్ సమావేశంలోనే ఒపిఎస్‌కు ఆమోదముద్ర వేస్తామని ఆయన చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్‌లో అంతర్గత పోరు అంటూ వస్తున్న కథనాలపై ఆయన స్పందించారు. అలాంటి అంతర్గత పోరు కాంగ్రెస్‌లో లేదని, అయితే కేవలం ముగ్గురు–నలుగురు మధ్య ముఖ్యమంత్రి పీఠం కోసమే పొరపొచ్చాలు జరిగాయని ఆయన తెలిపారు. అలాగే, ఏదైనా తప్పు జరిగితే 'రాజస్థాన్ తరహా పరిస్థితే' ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా బిజెపిలోకి ఫిరాయించబోరని, ప్రజల కోసం పని చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

# ఓవర్‌లోడ్ పెనాల్టీలపై ఆందోళన

### ఖనిజాభివృద్ధి సంస్థను ముట్టడించిన లారీ డ్రైవర్లు

**హైదరాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** ఖైరతాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ముట్టడించింది. ఓవర్ లోడ్ వేసుకుని వెళ్తేనే లారీలకు క్వారీ కాంట్రాక్టర్లు లోడ్ ఇస్తున్నారని లారీ ఓనర్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా పదుల సంఖ్యలో లారీ ఓనర్స్ అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్లకార్డులు పట్టుకుని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీ కాంట్రాక్టర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓవర్ లోడ్ కారణంగా ఆర్టీవోలు పెనాల్టీలు వేస్తున్నారని లారీ ఓనర్స్ ఆందోళన వ్యక్తం చేశారు. పెనాల్టీల వల్ల యజమానాలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాగే.. పాసింగ్ రూల్స్ ప్రకారమే లోడ్ కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్వారీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుండి బిల్లులు సమయానికి రాకపోవడం వల్ల ఓవర్ లోడ్ లు వేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి నిబంధనల ప్రకారం లోడ్ చేయించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అప్పటికే లారీ ఓనర్స్ ఆందోళనలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# ఢిల్లీలో మళ్లీ పెరిగిన వాయు కాలుష్యం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (సమ సమాజం):** ఢిల్లీలోవాయు కాలుష్యం మళ్లీ పెరిగింది. మోడరేట్ కేటగిరి నుంచి వెరీ పూర్ కేటగిరికి దిగజారింది. గత రెండు రోజుల నుంచి ఎయిర్ క్వాలిటీ మోడరేట్ కేటగిరిలో ఉండగా.. ఇవాళ వెరీ పూర్ కేటగిరికి చేరింది. మరో వైపు ఉష్ణోగ్రతలు కూడా తీవ్రంగా పడిపోయాయి. దీంతో చలి తీవ్రత పెరిగింది. ఒ వైపు పొల్యూషన్ మరోవైపు చలితో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోల్యూషన్ తో పాటు, చలి కారణంగా సీజనల్ వ్యాధుల బారీన పడుతున్నట్లు ఢిల్లీ ప్రజలు చెబుతున్నారు. ఎయిర్ పొల్యూషన్ తో శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలుపుతున్నారు. పిల్లల్ని బయటకు పంపించాలంటేనే భయమేస్తుందని.. పిల్లలు, వృద్ధులు లంగ్స్ ప్రా÷–లబెమ్స్ తో చాలా ఇబ్బంది పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# వైద్యారోగ్య శాఖలో 950 సివిల్ సర్జన్ పోస్టులు

### ఎంపిక జాబితాను విడుదల చేసిన అధికారులు

**హైదరాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** తెలంగాణ వైద్యారోగ్యశాఖలో 950 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు సోమవారం సెలక్షన్ లిస్ట్ విడుదలైంది. ఇందులో డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పరిధిలో 734 పోస్టులు, వైద్యవిధాన పరిషత్ పరిధిలో 209 పోస్టులు, ఐపీఎంలో ఏడు పోస్టులున్నాయి. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు ఈ ఏడాది జూన్‌లో 969 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విధితమే. 4,803 మంది దరఖాస్తులు వచ్చాయి. గత నెల మెరిట్ లిస్ట్ విడుదల, సర్టిఫికేట్ వెరిఫికేషన్ వైద్యారోగ్యశాఖ పూర్తి చేసింది. వాటి ఆధారంగా 950 పోస్టులకు సెలక్షన్ లిస్ట్ విడుదలను చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నియామక ప్రక్రియ పారదర్శకంగా, సులువుగా జరిగిందంటూ ట్వీట్ చేశారు.

# రైసు మిల్లుకు ప్రారంభోత్సవం



**మంచిర్యాల,డిసెంబర్ 19 (సమ సమాజం):** నెన్నల్ మండలం నందులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మి శ్రీనివాస ఇండస్ట్రీస్ రైస్ మిల్లును బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ రైస్ మిల్లును బీజేపీ యువ నాయకుడు బొమ్మన హరీష్ గౌడ్ నిర్మించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై మిల్లును ప్రారంభించారు. అర్చకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైస్ మిల్లులో కలియతిరిగి నిర్మాణాన్ని పరిశీలించారు. వివేక్ వెంకటస్వామితో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. హరీష్ గౌడ్ కు అభినందనలు తెలిపారు. ఇకపోతే జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని గొల్లపల్లి మండలం మల్లన్నపేట్ ఆలయంలో శ్రీ మల్లికార్జునస్వామిని వివేక్ వెంకటస్వామి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి దగ్గరుండి దర్శనం ఏర్పాట్లు చేయించారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు. మల్లన్నపేట్ మల్లికార్జునస్వామిని దర్శించుకోవడం తనకు సంతోషంగా ఉందని వివేక్ వెంకటస్వామి చెప్పారు. పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని దేవుడిని కోరుకున్నానని చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని విధాలా వారిని తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతులు వరి పంట ఎంత పండించినా కేంద్రం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కేంద్రం ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించి రైతులకు అండగా ఉండాలని వివేక్ వెంకటస్వామి కోరారు.

# భయపెడుతున్న బంగారం ధరలు



### 55వేలకు చేరడంతో ఆందోళన

### క్రమంగా పెరుగుతున్న బంగారం,వెండి రేట్లు

**ముంబై, డిసెంబర్ 19 (సమ సమాజం):** బంగారం ధరలు భయపెడుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో రోజురోజుకూ పెరుగుతోంది. 10 గ్రాముల బంగారం ధర రూ.55 వేలకు చేరువలో ఉండటం సామాన్యులను కలవర పెడుతోంది. నిజానికి పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారానికి డిమాండ్ భారీగానే ఉంది. కానీ రేటు చూస్తే కొండెక్కి కూర్చొంది. దీంతో బంగారం కొనలేక.. కొనక తప్పని పరిస్థితి కావడంతో ఏం చేయాలో తెలియక సామాన్యులు సతమతమవుతున్నారు. నిన్న స్వల్పంగా పెరిగిన బంగారం ధర నేడు మాత్రం స్థిరంగా ఉండి కొనుగోలుదారులకు కాస్త ఊరట కల్పిస్తోంది. ఇక వెండి ధర మాత్రం అత్యంత స్వల్పంగా పెరిగింది. సోమవారం దేశంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.49,950 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ.54,490 గా ఉంది. దేశీయంగా కిలో వెండి ధర రూ.300 మేర పెరిగి రూ.69,300 లకు చేరింది. దేశంలోని ప్రధాన నగరాలు, తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.49,950.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,490గా ఉంది. విజయవాడలో 22 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.49,950.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,490గా ఉంది. విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.49,950.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,490గా నమోదయ్యింది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.50,560.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,160గా ఉంది. కోల్‌కతాలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.49,950.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,490గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.50,000.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,540 ఉంది. కేరళలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.49,950.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,490 ఉంది. ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.50,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,640 ఉంది. ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.49,950.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.54,490 ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.73,000 విజయవాడ, శాఖపట్నం,చెన్నై, బెంగళూరు, కేరళలో కిలో వెండి ధర 73000గా ఉంది. కోల్‌కతా, ఢిల్లీ,ముంబైలో కిలో వెండి ధర రూ.69,300గా ఉంది.

# అధికార బిఆర్‌ఎస్‌లో అసమ్మతి

### మంత్రి మల్లారెడ్డి తీరుపై ఎమ్మెల్యేల ఆగ్రహం



**మేడ్చల్, డిసెంబర్ 19 (సమ సమాజం):** మంత్రి మల్లారెడ్డిపై ఐదుగురు ఎమ్మెల్యేలు అసమ్మతి గళం ఎత్తారు. ఆయన ఏకపక్ష నిర్ణయాలతో విసిగిపోతున్నామని ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, వివేక్, మైనంపల్లి, బేతి సుభాష్ రెడ్డి వాపోయారు. ఈ క్రమంలో మైనంపల్లి నివాసంలో సమావేశమైన ఐదుగురు నేతలు మల్లారెడ్డి అంశాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.మంత్రి పెత్తనం పై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మల్లారెడ్డి కారణంగా మేడ్చల్ జిల్లాలోని పదవులన్నీ మేడ్చల్ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమవుతున్నాయని ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. ఆదివారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ విషయం కేటీఆర్ వరకు వెళ్లిందని, రాత్రికి రాత్రే జీవో పాస్ చేసి భాస్కర్ యాదవ్ అనే వ్యక్తితో ప్రమాణ స్వీకారం చేయించాడని మైనంపల్లి ఆరోపించారు. మంత్రి మల్లారెడ్డి అవకాశం ఇచ్చిన వ్యక్తులకే మళ్లీ మళ్లీ పదవులు కట్టబెడుతూ పంతం నెగ్గించుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌ను సొంతపార్టీవారే దెబ్బతీసుకుంటారు

### బిజెపి నేత విజయశాంతి వ్యాఖ్య



**హైదరాబాద్, డిసెంబర్ 19 (సమ సమాజం):** తెలంగాణ కాంగ్రెస్‌లో పంచాయితీ ముదిరి పాకాన పడింది. కాంగ్రెస్ కమిటీ పదవులపై ఆ పార్టీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. కొందరు నేతలు పదవులకు రాజీనామాలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులపై బీజేపీ నేత విజయశాంతి స్పందించారు. జాతీయ స్థాయిలో గాని, రాష్ట్రాల స్థాయిలో గానీ కాంగ్రెస్ పార్టీ పతనానికి ఇతర పార్టీలేవీ వ్యూహ ప్రతివ్యూహాలు పన్ని తలలు బద్దలు కొట్టుకోవాల్సిన పని లేదు. ప్రత్యర్థి పార్టీలకు ఆ శ్రమ లేకుండా వారి తరఫున కాంగ్రెస్ నేతలే ఆ పనిని విజయవంతంగా చేసిపెడతారు. ఇందుకు అతిపెద్ద ఉదాహరణ తెలంగాణ కాంగ్రెస్ పార్టీయే అని వ్యాఖ్యానించారు. అంతర్గత తగాదాలతో నిత్యం కుమ్ములాడుకుంటూ... తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అసమ్మతితో ముఖ్యమంత్రులకి నిద్రపట్టకుండా... అధికారం లేనప్పుడు పీసీసీ ప్రెసిడెంట్‌కి ప్రశాంతత లేకుండా చేస్తుంటారు. ఒకవేళ కాస్తో కూస్తో పార్టీ కోసం పని చేసేవారెవరైనా ఉంటే... ఆ నాయకుడు లేదా నాయకురాలు ఎక్కడ తమని మించి హైలైట్ అవుతారోనన్న భయంతో వారిని బయటకి పంపేవరకూ శాంతించరు. గత కొన్నేళ్లుగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీని నిశితంగా గమనిస్తే, నేను చెప్పేవన్నీ అక్షర సత్యాలని అంగీకరించక తప్పదని వ్యాఖ్యానించారు. ఇటీవల తెలంగాణ కాంగ్రెస్‌లోని పరిస్థితులను పరిశీలిస్తే, పీసీసీలోని పూర్వ టీడీపీ, ప్రస్తుత బీఆరెస్ అనుకూల సభ్యులు, చిరకాల కాంగ్రెస్ వాదుల మధ్య చిచ్చురేపి, రెచ్చగొట్టి, విభేదాలతో పార్టీని కుప్పకూల్చే పరిణామాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజా కాంగ్రెస్ పార్టీ సమస్యలు ఈ విషయాన్ని చెప్పకనే చెబుతున్నయని విజయశాంతి అన్నారు.






# అందాల ఆరబోతలో ప్రగ్యా

కంచె సినిమా తో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ ప్రగ్యా జైస్వాల్. మొదటి సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు మొదటి సినిమాలో ఈ అమ్మడి అందం గురించి అంతా కూడా చాలా ప్రత్యేకంగా మాట్లాడుకోవడం జరిగింది. దాంతో కచ్చితంగా టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా ఈ అమ్మడు గుర్తింపు దక్కించుకోవడం ఖాయం అనుకున్నారు. ప్రగ్యా జైస్వాల్ అందాల విందు ఆమెకు సక్సెస్ లను తెచ్చి పెట్టలేక పోయాయి. అందమైన ఈ అమ్మడి అందాల ఆరబోత గురించి ఎంత చెప్పినా తక్కువే. పాపం ఈ అమ్మడికి తెలుగు లోనే కాకుండా ఇతర భాషల్లో కూడా సక్సెస్ లు దక్కలేదు. అక్కడ ఇక్కడ ఈ అమ్మడికి వస్తున్న ఆఫర్లు పెద్దగా లేకపోవడంతో కెరీర్ డల్ గా సాగుతోంది.ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇన్నాళ్లు అయినా కూడా ఇప్పటి వరకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు దక్కుతున్న దాఖలాలు లేవు. అఖండ వంటి భారీ విజయాన్ని గత ఏడాది ఈ అమ్మడు దక్కించుకుంది. కానీ ఈమెకు దక్కిన ఆఫర్లు మాత్రం పెద్దగా ఏమీ లేవు. అయినా కూడా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలతో ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందాలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. క్లీ వేజ్ షో తో పాటు థైస్ అందాలను చూపిస్తూ ఫొటోలకు ఫోజ్ ఇచ్చిన ఈ అమ్మడిని చూస్తూ నెటిజన్స్ వావ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ అమ్మడు రెండు మూడు మీడియం రేంజ్ సినిమాల్లో నటిస్తోంది. తెలుగు లోనే కాకుండా ఇతర భాషల నుండి కూడా ఆఫర్లు వస్తున్నాయట. ముందు ముందు అయినా ఈ అమ్మడికి సక్సెస్ దక్కి అందాల ఆరబోతకు మంచి ఫలితం దక్కేనా అనేది చూడాలి. హీరోయిన్ గా ఈ అమ్మడి యొక్క అందాల విందు కు ఆధరణ దక్కకున్నా కూడా ఫొటో షూట్స్ తో మాత్రం మంచి రెస్పాన్స్ ను దక్కించుకుంటూ ఉంది.




# మరింత ఆలస్యం కానున్న ఆదిపురుష్ విడుదల

ఇండియా వైడ్‌గా స్టార్ డమ్ తెచ్చుకున్న ప్రభాస్.. సౌత్, నార్త్ అనే సంబంధం లేకుండా ఫ్యాన్స్‌ను సంపాదించుకున్నాడు. అందుకే ప్రభాస్ సినిమా వస్తోందంటే అన్నింటా అంచనాలు పెరుగుతాయి. అలాగే ఆయన రాముడిగా కనిపించనున్న 'ఆదిపురుష్' కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు అభిమానులు. కానీ మూవీ టీమ్ వారికో బ్యాడ్ న్యూస్ చెప్పబోతోందని తెలుస్తోంది. మొదట అనుకున్న ప్రకారం సంక్రాంతికి ఈ చిత్రం రిలీజ్ కావలసి ఉంది. అయితే వచ్చే ఏడాది జూన్ 16కి విడుదలను వాయిదా వేస్తున్నట్టు నెల క్రితం ప్రకటించారు. ఇప్పుడు ఆ రిలీజ్ డేట్‌పైనా నెగిటివ్ ప్రచారం జరుగుతోంది. 'ఆదిపురుష్' జూన్ 16కి రావడం కూడా కష్టమేనంటూ ఓ న్యూస్ వైరల్ అవుతోంది. ఆశించిన స్థాయిలో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరగక పోవడం ఒక కారణమైతే, వీఎఫ్ఎక్స్, అవుట్ పుట్ సరిగా రాకపోవడమే మెయిన్ రీజన్స్ అని తెలుస్తోంది. ఆల్రెడీ రిలీజ్ చేసిన టీజర్‌కి కూడా మిక్స్‌డ్ టాక్ రావడం, రావణుడి గెటప్ మీద అభ్యంతరాలు, గ్రాఫిక్ వర్క్ మీద అసంతృప్తి వచ్చాయి. అందుకే 'ఆదిపురుష్' కోసం దర్శకుడు ఓం రౌత్ మరింత సమయం కేటాయించనున్నాడని తెలుస్తోంది.

# ఓటిటిలో షడ్యంత్ర వెబ్ సీరిస్ విడుదల




ప్రస్తుతం థియేటర్స్ కంటే ఎక్కువగా ఓటీటీలే ప్రేక్షకులకి వినోదాన్ని పంచుతున్నాయి. ఇంకా చెప్పాలంటే.. టీవీల కంటే ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ప్రేక్షకులు ఓటీటీలనే ఆశ్రయిస్తున్నారు. ఈ తరుణంలో డిసెంబర్ 18న ఓటీటీలో విడుదలైన వెబ్‌సిరీస్‌ల గురించి తెలుసుకుందాం.. షడ్యంత్ర ...నటాషా అనే మహిళ రోహన్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంటుంది. నిజానికి అతను ఆమె ఆస్తి కోసం ఆమెనే చంపాలని ఎ÷-లాన్ చేస్తుంటాడు. అయితే అతనే చనిపోయి విగతజీవిగా కనిపిస్తాడు. అసలేం జరిగింది. దర్యాప్తు అధికారి మోహన్ ఖన్నా మిస్టరీని ఛేదించగలిగాడా లేదా అనేది మిగతా కథ. ఈ వెబ్‌సిరీస్ ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది.



## సింగిల్ క్యారెక్టర్‌లో నందితా శ్వేత

'ఎక్కడికి పోతావు చిన్నవాడా' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి ఫస్ట్ సినిమాతోనే సక్సెస్ అందుకుంది నందితా శ్వేత. తర్వాత గ్లామర్ రోల్స్‌తో పాటు డిఫరెంట్ క్యారెక్టర్స్‌లో కనిపించింది. 'అక్షర' లాంటి మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ ఫిమేల్ లీడ్‌గా ఆకట్టుకుంది. తాజాగా మరో కొత్త ప్రయోగంతో ఆడియెన్స్ ముందుకు రాబోతోంది నందిత. ఇటీవల సింగిల్ క్యారెక్టర్ మూవీస్‌కి సౌత్‌లో కూడా ఆదరణ దక్కుతోంది. అలాంటి సింగిల్ క్యారెక్టర్ సినిమాలో నటిస్తోంది నందిత. శ్రీ విజయానంద్ పిక్చర్స్ బ్యానర్‌పై కొత్త దర్శకుడు సత్యవెంకట్ రూపొందిస్తున్న చిత్రం 'రారా.. పెనిమిటి'. ప్రమీల నిర్మిస్తున్నారు. మొత్తం సినిమాలో ఒకే ఒక్క పాత్రగా కనిపించే నందితా శ్వేత పర్ఫార్మెన్స్ అందర్నీ ఆకట్టుకుంటుందన్నారు మేకర్స్. తెరమీద కనిపించకుండా కేవలం డైలాగుల రూపంలో బ్రహ్మానందం, నాగబాబు, తనికెళ్ళ భరణి, సునీల్, తాగుబోతు రమేష్, సప్తగిరి, హేమ, అన్నపూర్ణ, శివపార్వతి వినిపించే పాత్రలు పోషించారు. కనిపించని హీరో పాత్రకు శివబాలాజీ గాత్రానిచ్చాడు. మణిశర్మ ఈ చిత్రానికి ఐదు పాటలను అందించారు. టీజర్, ట్రైలర్లను దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు విడుదల చేయగా, ఫస్ట్ లిరికల్ వీడియోను చిత్ర సంగీత దర్శకుడితో పాటు నందితా శ్వేత విడుదల చేసింది. మరోవైపు నందిత నటించిన 'ఎస్5' చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది.



## బేషరమ్ పాటపై దీపికకు ప్రకాశ్ రాజ్ మద్దతు

బాలీవుడ్ టాప్ హీరోయిన్ దీపికా పదుకొనెకు మద్దతుగా ప్రకాశ్ రాజ్ నిలబడ్డాడు. షారుఖ్ ఖాన్ తో నటించిన పఠాన్ సినిమా బేషరమ్ అనే పాటలో దీపిక ధరించిన దుస్తులు విషయం ఈ మధ్య వివాదాస్పదం అయింది. సినిమాను బ్యాన్ చేయాలని పలు చోట్ల ఆందోళనలు జరుగుతున్నాయి. బిగోట్స్ అంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేస్తున్నారు. అయితే, దీనిపై స్పందించిన ప్రకాశ్ రాజ్ ఫీఫా వరల్డ్ కప్ లో దీపిక ట్రోఫీని ఆవిష్కరించిన ఫొటోలను ట్విట్టర్ లో పోస్ట్ చేసి సపోర్ట్ గా నిలబడ్డాడు. 'నిన్ను చూస్తే గర్వంగా ఉంది. నీ విషయంలో ఈ బిగోట్స్ ఇప్పుడు ఫిఫా వరల్డ్ కప్ ని బ్యాన్ చేస్తారా!' అని రాసుకొచ్చాడు. అయితే, ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ కి ముందు దీపిక ట్రోఫీని ఆవిష్కరించింది. ఫిఫా చరిత్రలో ఇలా ఓ నటికి ట్రోఫీని లాంచ్ చేసే అవకాశం రావడం ఇదే మొదటిసారి. దీపిక ట్రోఫీని లాంచ్ చేయడం భారతదేశానికి దక్కిన గర్వకారణం అని చెప్పుకొచ్చాడు.




# ఎమర్జెన్సీ సన్నివేశాల కోసం తపన

లోక్‌సభలో చిత్రీకరణకు అనుమతి కోరుతూ లేఖ

'మిషన్ ఇంపాజిబుల్' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నటుడు టామ్ క్రూజ్ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న ఎమర్జెన్సీ' చిత్రంలోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ... ఆమె లోక్‌సభ కార్యాలయాన్ని కోరినట్టు సమాచారం. అయితే ఆ విషయం ప్రస్తుతం పరిశీలన దశలో ఉందని, అనుమతి లభించకపోవచ్చని పలువురు భావిస్తున్నారు. సాధారణంగా పార్లమెంట్ ఆవరణలో షూటింగ్ లేదా వీడియోగ్రఫీ చేయడానికి ప్రైవేట్ సంస్థలకు అనుమతి ఉండదు. ఇది ఏదైనా అధికారిక లేదా ప్రభుత్వ పని కోసం జరిగితే అది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటారు. పార్లమెంట్ ప్రాంగణంలో చిత్రీకరణకు ప్రభుత్వ ఛానల్లైన దూరదర్శన్, సంసద్ టీవీలకు మాత్రమే ప్రస్తుతం అనుమతి ఉంది. దీంతో కంగనా సినిమా షూటింగ్‌కు అనుమతి లభించకపోవచ్చని తెలుస్తోంది. 'ఎమర్జెన్సీ' షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమైంది. ఈ చిత్రానికి దర్శకత్వం, నిర్మాత రచన అన్నీ కూడా కంగనా రనౌతే కావడం విశేషం.1975లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో విధించిన ఎమర్జెన్సీ నేపథ్యంలో రాబోతున్న ఈ సినిమాలో కంగనా... ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. 'ఎమర్జెన్సీ" అనేది భారతదేశ రాజకీయ చరిత్రలోనే ఒక కీలక ఘట్టం అని.. ఇది మనం అధికారాన్ని చూసే విధానాన్ని పూర్తిగా మార్చేసిందని రనౌత్ అప్పట్లో ఓ ప్రకటనలో తెలిపారు. అందుకే తాను ఈ కథను చెప్పదలచుకున్నాని, ఆ సమయంలో ఇందిరా చూపిన పవర్ డైనమిక్ కు తాను అట్రాక్ట్ అయ్యానని చెప్పారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in